సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం ၊ 23 ၊ జనవరి ၊ 2023



భూ మాయ..!

వెంచర్ చేసి విక్రయించిన ప్లాట్లను కొందరు వ్యవసాయ భూమిగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

వివరాలు 8లో ▸



బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జోగుళాంబ బ్రహ్మోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /16.0

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తాయి. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి జెడ్పీ స్థాయీసంఘం సమావేశాలు

కందనూలు: జెడ్పీ స్థాయీ సంఘం సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ శాంతాకుమారి అధ్యక్షతన సోమ, మంగళవారం రెండురోజుల పాటు కొనసాగుతాయని జెడ్పీ సీఈఓ ఉషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 2, 3, 4, 5 స్థాయీ సంఘాలు, 24న 6, 7, 1వ స్థాయీసంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

వేరుశనగ క్వింటా రూ.8,509



కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆదివారం 275 బస్తాల వేరుశనగ విక్రయానికి వచ్చింది. గరిష్టంగా రూ.8,506.99, కనిష్టంగా రూ.7,869, సరాసరి రూ.8,289 ధర లభించింది. కంది క్వింటాకు గరిష్టంగా రూ.6,609, కనిష్టంగా రూ.6,509 ధర లభించినట్లు మార్కెట్ కార్యదర్శి భగవంత్ తెలిపారు.

'ఉపాధ్యాయ బదిలీలకు జీరోసర్వీస్ ఇవ్వాలి'



కందనూలు: ఉపాధ్యాయ బదిలీలకు జీరో సర్వీస్ ఇవ్వాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఆదివారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సంఘం నాయకులు డీఈఓ గోవిందరాజులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా తయారీలో పారదర్శకత పాటించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న ఖాళీలను చూపించాలని, క్యాడర్ వారీగా సీనియార్టీ జాబితా తయారు చేసి అందుబాటులో ఉంచాలని కోరారు. తప్పొప్పులను సరిచేసుకునేందుకు తగిన సమయం ఇవ్వాలని డీఈఓకు విన్నవించారు. మెరిట్ కం రోస్టర్ విధానం పాటిస్తూ ఉపాధ్యాయులకు నష్టం జరగకుండా ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు స్పౌజ్ జాబితా తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు, జిల్లా బాధ్యుడు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని సీట్లు కాంగ్రెస్‌వే..

ఉమ్మడి జిల్లాలో 14 స్థానాలు గెలిచేది మనమే

- పాలమూరు బిడ్డగా వచ్చా..: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- ఇక్కడే ఉంటా.. ఇక్కడే సేవ చేస్తా.. ఇక్కడే చస్తా..
- జూరాల, బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులు పూర్తి చేసింది కాంగ్రెస్సే
- బిజినేపల్లిలో 'దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ'



అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి



సభకు హాజరైన కార్యకర్తలు

సాక్షి, నాగర్‌కర్నూల్/బిజినేపల్లి: 'పాలమూరు బిడ్డకు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా సోనియాగాంధీ అవకాశం ఇచ్చింది. ఇక్కడే పుట్టినా.. ఇక్కడే సేవ చేస్తా.. ఇక్కడే చస్తా' అని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. నల్లమలలో కొండారెడ్డిపల్లిలో పుట్టిన మీలో ఒకడికి రాష్ట్రంలో 119 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు బీ ఫారంపై సంతకం పెట్టే అవకాశం ఇచ్చిందని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 14 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరులో జూరాల, బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులను పూర్తి చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని చెప్పారు. ప్రాజెక్టులు మేం పూర్తిచేస్తే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పంచె కట్టుకుని కాల్వల దగ్గర ఫొటోలు దిగుతున్నారని దుయ్యబట్టారు. లాల్చి వేసుకుంటే లాల్‌బహదూర్ శాస్త్రి, పంచె కట్టుకుంటే వైఎస్ రాజశేఖరరెడ్డి కాలేరని వ్యాఖ్యానించారు. వైఎస్సార్ కావాలంటే త్యాగం, గుణం ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు తాను ఎక్కడికైనా రావడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. సమైక్య రాష్ట్రంగా ఉన్నప్పుడు పాలమూరులో 3.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నాగం జనార్దన్‌రెడ్డి కేఎల్‌ఐ ప్రాజెక్టు మంజూరు చేయించారని చెప్పారు. తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ కల్వకుర్తి ప్రాజెక్టును 3.60 లక్షల నుంచి 5 లక్షల ఎకరాలకు పెంచి ప్రాజెక్టు పనులను పూర్తిచేశారని వివరించారు. మీరు హామీ ఇచ్చిన పాలమూరు-రంగారెడ్డి, మార్కండేయ ప్రాజెక్టులు పూర్తిచేయకపోగా.. దళితులు, గిరిజనుల మెడపై కాలు పెట్టి తొక్కే ధైర్యం వీరికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో దళిత, గిరిజన, బలహీన వర్గాల వారికి కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు.

■ ఈసారి కాంగ్రెస్‌కు 21 సీట్లు కూడా రావని మంత్రి జనార్దన్ రెడ్డి అంటున్నాడని, వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 14 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని రేవంత్ జోస్యం చెప్పారు. 'పొట్టోడు, పొడుగోడు వచ్చి ఏం మాట్లాడుతరో చూస్తానని అన్నడు. నాగంకు చేతనైతలేదని అంటుండు. నాగం సోయి తప్పి నీ మీద పడితేనే సచ్చి శవం అయితవు. నాగంతో పెట్టుకున్న గాలి జనార్దన్‌రెడ్డి చర్లపల్లి జైలులో చిప్పు కూడు తిన్నాడని తెలుసుకో. వందల కోట్లు టాక్స్ కడుతున్నావంటే అదృష్టవంతుడివే. కానీ ఈ బలుపు మాటలు ఏంది'. రాష్ట్రంలో దళిత, గిరిజన, బలహీన వర్గాలవారంతా ఏకమై కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

ప్రజలకు సేవకుడిగానే ఉంటా: నాగం జనార్దన్‌రెడ్డి



తాను దశాబ్దాల పాటు రాజకీయంలో ఉన్నా ఏనాడూ ఎవరిని పరుసపదజాలంతో తిట్టలేదని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. అలాంటి తనపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారని చెప్పారు. తనను చెప్రాసిగా కూడా పనికిరానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నాడని, తాను ప్రజలకు ఎప్పటికీ సేవకుడిగానే ఉంటానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే దౌర్జన్యాలు మితిమీరాయని, నల్లమట్టి, గుట్టలు మింగుతున్నారని, భూముల కబ్జా పెరిగిపోయిందని ఆరోపించారు. ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట నష్టపరిహారం ఇవ్వకుండా రైతుబంధుకే పరిమితం చేశారని విమర్శించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రతి వీధిలో తిరుగుతానని, ప్రతి ఇంటికి వచ్చి చేయి కలుపుతానని చెప్పారు. కార్యక్రమంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్‌చౌదరి, నవీన్ జావెద్, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, రాష్ట్ర నాయకులు చిన్నారెడ్డి, సంపత్ కుమార్, షబ్బీర్ అలీ, రాములునాయక్, బలరాంనాయక్, అద్దంకి దయాకర్, శివసేనారెడ్డి, ప్రీతం, జగన్‌లాల్ నాయక్, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, జగదీశ్వర్‌రావు, అభిలాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చింది ఇందుకేనా?: ఠాక్రే

తెలంగాణ ప్రజల వికాసం, పేదలు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, కానీ రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం, అక్రమాలు, దౌర్జన్యాలతో పాలన సాగిస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

కేసీఆర్‌ను గద్దె దించాలి: భట్టి



వాల్యానాయక్, మిద్దె రాములుపై జరిగిన దాడిని యావత్ తెలంగాణ రాష్ట్ర దళిత, గిరిజనులపై జరిగిన దాడిగా భావించి కేసీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని సీఎల్పీ నేత బట్టి విక్రమార్క అన్నారు. మా జెండా మోసి.. ఎవరినైనా చంపుకోండంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ధైర్యంతోనే ఆ పార్టీ నాయకులు ఈ దుశ్చర్యకు పాల్పడుతున్నారన్నారు. అపార రాజకీయ అనుభవం కలిగిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ప్రజా సమస్యలను ప్రశ్నించడానికి వెళ్తే వెంట వచ్చిన గిరిజన నాయకుడు వాల్యానాయక్ గొంతుపై కాలు పెట్టి తొక్కిన దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ రాచరిక వ్యవస్థలో లేదని, సంపూర్ణ ప్రజాస్వామ్యంలో ఉందన్న విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ అండ చూసుకుని ఆ పార్టీ నాయకుల అరాచకాలు పేట్రేగిపోతున్నాయని, ఇకపై వాటిని సహించేది లేదన్నారు.

ఆ రోజే చచ్చేవాడిని..



'ఈ నెల 6న మార్కండేయ ప్రాజెక్టు పనుల పరిశీలన నాగం జనార్దన్‌రెడ్డి వచ్చారు. మేం కూడా వెళ్లాం. బీఆర్‌ఎస్ నేతలు మమ్మల్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ప్రశ్నించిన నాపై దాడి చేశారు. నా మెడపై కాలు పెట్టి తొక్కారు. నేను బలవంతంగా నెట్టేసి తప్పించుకోగలిగా. లేకపోతే ఆ రోజు చచ్చిపోయేవాడిని. అక్రమంగా పెట్టిన కేసులు కొట్టేయంతో పాటు నాకు న్యాయం జరిగేలా చూడాలి.' అని కాంగ్రెస్ కార్యకర్తలు వాల్యానాయక్ కోరారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

కందనూలు: పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న జ్ఞాన సరస్వతి ఆలయంలో 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రాతః కాలంలో ధ్వజారోహణం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను జిల్లా బాలకళ్యాణ ఆశ్రమ అధ్యక్షుడు దొడ్ల నారాయణరెడ్డి ప్రారంభించారు. గోపూజ, యాగశాలలో యజ్ఞాలు, నిర్వహించారు. ఉదయం వచ్చిన చిన్నారులకు అక్షరాభ్యాసం ఆలయ ప్రధాన అర్చకుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో చేయించారు. చిన్నారులకు పలకలు, విద్యాసామగ్రి అందించారు. ఆలయానికి వచ్చిన భక్తులు, శివమాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి ఎలిమె ఈశ్వరయ్య, మిడిదొడ్డి శివశంకర్, కమిటీ సభ్యులు ఎల్.వరలక్ష్మి, ఎస్.రవికుమార్, శివశంకర్, భూపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, స్వామి, గిరి పాల్గొన్నారు.

వైభవంగా గజవాహన సేవ



ఊర్కొండ: ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గజవాహన సేవ వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించి గజ వాహనంపై ఉంచి ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ సమయంలో అభయుడి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అర్చకులు దత్తాత్రేయశర్మ, ప్రవీణ్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, మహేష్‌శర్మ, సిబ్బంది వరలక్ష్మి, ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే ఉదయం ప్రాతఃకాల పూజలు, సహస్ర నామార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారి సన్నిధిలో సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాలకమండలి సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం అర్ధరాత్రి దాటాక రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రథోత్సవంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

అచ్చంపేట రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని భాషా పండితులకు పీఈటీలుగా పదోన్నతులు కల్పించాలని రూప్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ కోరారు. ఆదివారం పట్టణంలోని టీఎస్‌జీఓ భవనంలో నిర్వహించిన పండిత జేఏసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ముందుకురావడం అభినందనీయమని కొనియాడారు. న్యాయస్థానాల సాకు చూపుతూ పండిత పీఈటీలకు అవకాశం కల్పించకపోవడం దురదృష్టకరమని.. తీర్పుకు లోబడి పదోన్నతులు కల్పించడానికి ముఖ్యమంత్రి చొరవ చూపాలని కోరారు. అనంతరం ఆర్‌యూపీపీ టీఎస్ వార్షిక విద్యా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, పండితులు రూప్లా, రమేష్, లక్ష్మయ్య, అష్రఫ్, చందునాయక్ పాల్గొన్నారు.



విద్యా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

గమ్మత్తు!

ఇటీవల కోస్గిలో గంజాయికి మళ్లీ బీజం పడింది. పట్టణంలోని ఓ పాఠశాల వద్ద, కొడంగల్ దారిలో పలువురు పాన్‌షాపులను అడ్డాగా చేసుకుని హుక్కా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. గంజాయి మత్తులో యువత తేలియాడుతోంది. అధికారులు దాడులు నిర్వహించినప్పుడు మూసేయడం.. ఆ తర్వాత యథావిధిగా కార్యకలాపాలు కొనసాగించడం ఆనవాయితీగా మారింది. దేవిడికాలనీకి చెందిన ఓ యువకుడు.. చెన్నారం రోడ్డులో ఓ భవనంలో అద్దెకు ఉంటున్న ఓ ఆటో డ్రైవర్.. కాలేజీ యువకులకు గంజాయి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా.. పోలీస్, ఎక్సైజ్ అధికారులు మిన్నకుండిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- 'నల్లమల' కేంద్రంగా గంజాయి సాగు
- హైదరాబాద్, రాష్ట్ర సరిహద్దుల నుంచి దిగుమతి
- రవాణాలో యువకులదే కీలకపాత్ర
- గుట్టుచప్పుడు కాకుండా హుక్కా సెంటర్ల నిర్వహణ?
- తూతూమంత్రంగానే ఎక్సైజ్ శాఖ తనిఖీలు

కల్తీ కల్లు, నకిలీ మద్యానికి కేరాఫ్‌గా నిలిచిన ఉమ్మడి పాలమూరు జిల్లా.. క్రమక్రమంగా గంజాయికి సైతం కేంద్రంగా మారుతోంది. ఏటేటా పెరుగుతున్న కేసులే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా మారుమూల ప్రాంతాల్లో సాగవుతున్న గంజాయికి తోడు.. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు పెద్ద ఎత్తున దిగుమతి అవుతుండడం బెంబేలెత్తిస్తోంది. ప్రధానంగా ఈ దందా పల్లెలకు విస్తరించడం.. అధిక సంఖ్యలో యువత గంజాయిమత్తుకు అలవాటు పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో నిషేధిత గంజాయి సాగు.. అక్రమంగా రవాణా అవుతున్న తీరుపై 'సాక్షి' పరిశీలనాత్మక కథనం..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

హైదరాబాద్ టు మహబూబ్‌నగర్..

ఆంధ్ర–ఒడిశా సరిహద్దు (ఏఓబీ)లో ఎక్కువగా గంజాయి సాగవుతోంది. అక్కడి నుంచి పలువురు ముఠాగా ఏర్పడి తెలంగాణలోని హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాలకు దీన్ని రవాణా చేస్తున్నారు. అయితే ప్రధానంగా హైదరాబాద్ నుంచే పొడి గంజాయి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సరఫరా అవుతోంది. కేజీల చొప్పున దిగుమతి చేసుకున్న కేటుగాళ్లు చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి ఒక్కోదాన్ని రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. మరోవైపు నల్లమల అటవీ పరిసర ప్రాంతాల్లో గంజాయి సాగవుతుండగా.. ఆయా చోట్ల నుంచి హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాకు రవాణా చేస్తున్నారు. వాట్సప్‌లో కోడ్ భాష ఆధారంగా ఏజెంట్లకు.. తద్వారా సబ్ ఏజెంట్లకు గంజాయి ప్యాకెట్లు చేరుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు, ఎక్సైజ్‌శాఖ కళ్లు గప్పి అక్రమార్కులు పెద్దమొత్తంలో దందా చేస్తున్నట్లు సమాచారం.

■ నాగర్‌కర్నూల్ పట్టణ శివారులోని పాడుబడ్డ భవనాల్లో, నల్లవెల్లి రూట్‌లో, కల్వకుర్తిలోని సబ్ రిజిస్ట్రార్ ఏరియాలో, భగీరథ, కురుమిద్ద రోడ్‌లో, తిమ్మినోనిపల్లి, గచ్చుబాయి–పంజుగుల రోడ్, ఎల్లికల్ రోడ్‌లో..

అబ్కారీ శాఖది ప్రేక్షకపాత్రే?

మాదక ద్రవ్యాల రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో పోలీసులతోపాటు ఎక్సైజ్‌శాఖదే కీలకపాత్ర. అయితే ఉమ్మడిజిల్లాలో ఆ శాఖ ప్రేక్షకపాత్ర వహిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతర నిఘాను మరిచిపోవడంతో పాటు అక్రమార్కులను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఆ శాఖలో కొన్నేళ్లుగా తిష్టవేసిన పలువురు అధికారులు, సిబ్బందిపై ఎప్పటి నుంచో ఉన్నాయి. అవిభాజ్య మహబూబ్‌నగర్ జిల్లాలో 2020 నుంచి ఇప్పటివరకు గంజాయి కేసులు మొత్తం 88 నమోదు కాగా.. 159 మందిని అరెస్ట్ చేశారు. ఇందులో ఎక్సైజ్‌శాఖ 36 కేసులు నమోదు చేయగా 67 మంది అరెస్ట్ అయ్యారు. అదే పోలీసులు నమోదు చేసినవి 52 కేసులు కాగా.. 92 మందిని కటకటాల వెనక్కి పంపించారు.



నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం లక్ష్మాపురం (బీకే)లో సాగుచేసిన గంజాయి (ఫైల్)

ఈ ప్రాంతాల్లోనే సాగు అధికం..

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో గంజాయి అధికంగా సాగవుతున్నట్లు తెలుస్తోంది. పదర మండలంలోని మద్దిమడుగు, ఇప్పలపల్లి, అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ (బీకే), తిర్మలాపూర్ (బీకే), అచ్చంపేట మండలంలోని రంగాపూర్, సిద్ధాపూర్, బల్మూర్ మండలంలోని బాణాల, లక్ష్మింపల్లి, లింగల మండలంలోని అప్పాయిపల్లి, చెన్నంపల్లితోపాటు తదితర గ్రామాలు, చెంచు పెంటల్లో.. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ మండల పరిధిలోని అటవీ గ్రామాల్లో గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా సాగుచేస్తున్నారు.

జిల్లాలు, సంవత్సరాల వారీగా నమోదైన కేసులు..

జిల్లా	2020		2021		2022		2023 (ఇప్పటివరకు)	
	కేసులు	అరెస్ట్	కేసులు	అరెస్ట్	కేసులు	అరెస్ట్	కేసులు	అరెస్ట్
మ.నగర్/నారాయణపేట	4	13	11	15	24	55	1	4
నాగర్‌కర్నూల్	4	4	11	11	8	8	0	0
జోగుళాంబ గద్వాల	0	0	10	15	4	11	0	0
వనపర్తి	2	3	6	14	3	6	0	0
మొత్తం	10	20	38	55	39	80	1	4

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నమోదైన కేసులు..

ఏడాది	కేసులు	అరెస్ట్	పట్టుబడిన గంజాయి	ధ్వంసం చేసిన మొక్కలు
2020	3	3	0	407
2021	3	3	1.77కిలోలు	0
2022	2	1	0.12 కిలోలు	321
జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నమోదైన కేసులు ఇలా..				
2020	1	1	150 గ్రాములు	0
2021	8	8	56 కిలోలు	0
2022	6	7	3.5 కిలోలు	0



గంజాయి అడ్డాలు ఇవే..

■ మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేట, మోతీనగర్, బంజారా కాలనీ, బండమీదిపల్లి పరిధితో పాటు పట్టణ శివారులో జనసంచారం లేని ప్రాంతాలు గంజాయి పీల్చే వారికి అడ్డాలుగా మారాయి. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్ పరిధిలో ఇప్పటివరకు గంజాయికి సంబంధించిన కేసులు నమోదు కానప్పటికీ.. ఉత్తరాదికి చెందిన కార్మికులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నట్లు సమాచారం.

■ గద్వాల జిల్లాకేంద్రంలోని వేదనగర్, బీసీ కాలనీ, భీంనగర్, 2వ రైల్వే గేట్, అలంపూర్ పట్టణ శివారు, ఉండవెల్లి మండలం పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో శాంతినగర్, అయిజలోని తదితర ప్రాంతాల్లో..

■ వనపర్తిలోని పెబ్బేరు రూట్‌లో అటవీ ప్రాంతంలో, చందాపూర్ రోడ్డు వైపు శ్మశానవాటిక సమీపంలో, రాజీవ్ గృహకల్ప సమీపంలో, కొత్తకోట మండలం కానాయిపల్లి, సంకిరెడ్డిపల్లి శివార్లలో..

దాదాపుగా అందరూ యువకులే..

గంజాయిని దొంగచాటుగా రవాణా చేస్తున్న వారితో పాటు వినియోగిస్తున్న వారిలో 85శాతానికి పైగా యువత.. అందులోనూ విద్యార్థులే ఉన్నట్లు తెలుస్తోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన 16 నుంచి 22 ఏళ్ల వయసులోపు వారే. గంజాయి వ్యసనానికి అలవాటు పడిన వ్యక్తులను నిశితంగా పరిశీలిస్తూ వచ్చిన ముఠాల నిర్వాహకులు వారి జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. వారి ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని.. ఎర వేస్తూ తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



జిల్లాలో గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా గంజాయి సాగు జరగడం లేదు. ఎవరైనా గంజాయి సాగు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తాం. జిల్లాలో గంజాయి నిర్మూలన కోసం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ టీంలు కూడా పని చేస్తున్నాయి. యువత గంజాయికి బానిసలుగా మారకుండా తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి.

– మనోహర్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

ప్రత్యేక బృందాలతో తనిఖీలు..

ఉమ్మడి జిల్లాలో గంజాయి కట్టడి కోసం టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల నుంచి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నాం. గంజాయి సాగుచేసే వాళ్లు ఉంటే అలాంటి వారికి రైతుబంధు రాకుండా చర్యలు తీసుకోవడానికి ఆయా జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్తున్నాం. పాత కేసులు ఉన్నవారితో పాటు అనుమానితులను సెక్షన్ 109, 110ప్రకారం రూ.2 లక్షలకు బైండోవర్లు చేస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో తక్కువ మోతాదులోనే గంజాయి లభ్యం అవుతోంది. వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కట్టడి చర్యలు చేపడుతున్నాం.

– దత్తరాజ్‌గౌడ్, ఎక్సైజ్ శాఖ డీసీ

క్లుప్తంగా

డ్రెయినేజీలో పడి వృద్ధురాలు మృతి



శంకరమ్మ (ఫైల్)

నవాబుపేట: మండలంలోని కూచూర్ చెందిన గుడుపల్లి శంకరమ్మ (75) ఆదివారం తన ఇంటి ముందు ఉన్న డ్రెయినేజి దాటుతుండగా అందులో పడింది. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లగా, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని మారేపల్లికి చెందిన మన్నెం(70) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మారేపల్లికి చెందిన మన్నెం కొన్నాళ్లుగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురై ఈ నెల 17న మధ్యాహ్నం ఇంటి వద్దనే పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. 21న చికిత్స పొందుతూ.. మృతిచెందాడు. అతని కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలియజేశారు.

అన్నదమ్ముల గొడవలో ఇరువురికి గాయాలు

కొత్తకోట: ఇద్దరు అన్నదమ్ములు గొడవ పడిన ఘటనలో ఇరువురికి గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని కానాయపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కానాయపల్లికి చెందిన గోపాల్, పురుషోత్తం అన్నదమ్ములు. 4నెలల కిందట పురుషోత్తం భార్య శారదతో, తన భావ అయినటువంటి గోపాల్ గొడవ పడటంతో పురుషోత్తం భార్య శారద, తన భర్త పురుషోత్తంను వదిలిపెట్టి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతను అన్నపై పగ పెంచుకున్నాడు. ఆదివారం ఉదయం గోపాల్ బహిర్భూమికి వెళ్లి వస్తుండగా.. పురుషోత్తం తన సొంత ఆటోతో ఢీకొట్టి, ఆటోలోని కత్తితో దాడిచేశాడు. ఈ దాడిలో గోపాల్ తల భాగం, మెడ భాగం, చేతివేళ్లకు గాయాలయ్యాయి. దీంతో గోపాల్ కుమారుడు సురేష్ తన తండ్రిని కొట్టిన కోపంతో అదే కత్తితో పురుషోత్తం తలపై దాడి చేశాడు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

బోయిన్‌పల్లిలో 19 గొర్రెలు చోరీ

మిడ్జిల్: బోయిన్‌పల్లిలో శనివారం రాత్రి 19 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. యాదయ్యకు చెందిన 9 గొర్రెలు, 3 గొర్రె పొటేళ్లు, నామ బచ్చయ్యకు చెందిన 6 గొర్రెలు, ఒక పొట్టేలు ఎత్తుకెళ్లారని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు.

బైక్ దొంగ రిమాండ్

గద్వాల క్రైం: ముఖ్య కూడలిలో నిలిపిన బైక్‌లను అపహరించిన అంతర్రాష్ట్ర బైక్ దొంగను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపారు. ఆదివారం ఉదయం పట్టణ శివారులో వాహనాల తనిఖీ చేపడుతున్నారు. కర్నూల్ జిల్లా గూడురుకు చెందిన నడిమిటి క్రిష్ణను బైక్ వివరాలు, లైసెన్స్‌ను చూయించాల్సిందిగా విచారించగా.. పొంతన లేని సమాధానం ఇచ్చాడు. అదుపులోకి తీసుకుని విచారించగా.. గద్వాల పట్టణంలో మూడు బైక్‌లు, రాయచూర్ నుంచి మరో బైక్‌ను అపహరించినట్లు నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడి నుంచి 4 బైక్‌లను స్వాధీనం చేసుకుని గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలియజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గద్వాల క్రైం: పేకాట ఆడుతున్న స్థావరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడులు చేపట్టి 9మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు. మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.12,080ల నగదు, నలుగు బైక్‌లు, 9 సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేశామన్నారు.

భూమాయ..!



మాచారం శివారులోని వెంచర్‌లో ఆందోళన చేస్తున్న బాధితులు

- జడ్చర్లలో పేట్రేగిపోతున్న భూ బకాసురులు
- 30 ఏళ్ల కిందట అమ్మిన ప్లాట్లకు ఎసరు
- తాజాగా వ్యవసాయ భూమిగా రిజిస్ట్రేషన్
- 'ధరణి' లోపాలను ఆసరాగా చేసుకుని అక్రమాలు
- లబోదిబోమంటున్న ప్లాట్ల కొనుగోలుదారులు

జడ్చర్ల: మూడు దశాబ్దాల కిందట వెంచర్ చేసి విక్రయించిన ప్లాట్లపై అక్రమార్కులు కన్నుపడింది. వెంటనే తమకేమి అడ్డు అంటూ అక్రమార్కులు అంతా ఒక్కటై.. గంపగుత్తగా వందలాది ప్లాట్లను కొల్లగొట్టేందుకు వ్యూహరచన చేశారు. వీరికి అధికారులు కూడా తోడయ్యారు. ఇంకేముంది సాంకేతిక లోపాలను ఆసరా చేసుకుని వెంచర్‌లోని ప్లాట్లను వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్ చేసి.. ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఎసరు పెట్టారు. ఆ తర్వాత అక్రమార్కులు సదరు ప్లాట్లను చదును చేసే పనులు మొదలుపెట్టడంతో విషయం వెలుగుచూసింది. జడ్చర్ల మండలం కావేరమ్మపేట, మాచారం గ్రామాల శివారులో చోటుచేసుకున్న ఈ భూమాయపై 'సాక్షి' కథనం.

40 ఎకరాల్లో వెంచర్లు..

కావేరమ్మపేట (జడ్చర్ల), మాచారం గ్రామ శివారులో జాతీయ రహదారి–44ను అనుసరించి సర్వే నంబర్లు 41, 42, 43, 44లో దాదాపు 40 ఎకరాల్లో వెంకటాద్రినగర్ పేరుతో ఏ, బీ, సీ బ్లాకులుగా విభజించి ఒక్కో ప్లాటును 133 చ.గ. విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఇందుకు గాను డీఎల్‌పీఓ లేఅవుట్‌కు సంబంధించి డిసెంబర్ 1993న అనుమతులు కూడా ఇచ్చారు. వెంచర్‌లో దాదాపు వెయ్యికిపైగా ప్లాట్లు ఏర్పాటు చేసి విక్రయించారు. ఆయా ప్లాట్లను నెలవారి కిస్తుల ప్రకారంగా చాలా



డీఎల్‌పీఓ జారీ చేసిన వెంకటాద్రినగర్ వెంచర్ లేవుట్

మంది కొనుగోలు చేసి తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోగా.. మరికొందరు ఆర్థిక ఇబ్బందులతో కొన్ని నెలల పాటు కిస్తులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోయారు.

తిలా పాపం.. తలా పిడికెడు

ఇటీవల జడ్చర్ల– మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిని అనుసరించి ఇలాగే ఉన్న ప్లాట్లను కొల్లగొట్టి రూ.కోట్లు గడించిన అక్రమార్కులు కావేరమ్మపేట, మాచారం శివార్లలోని ఖాళీగా ఉన్న వెంచర్లపై కన్నేశారు. ఇంకేముంది ఓవైపు అధికార పార్టీ బలంతోపాటు అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఆయా ప్లాట్లను కబ్జా చేశారు. ఇటీవలే మాచారం శివారులోని ఓ దాబాలో సమావేశమై తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా అంతా ఒక్కటై బాగాలు వేసుకుని పంచుకున్నారు.

నాలాగా గుర్తించకపోవడంతో..

ధరణిలో ఉన్న సాంకేతిక సమస్యను ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు తమ పేర్ల మీద వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందుకు సంబంధిత అధికారులు కూడా సహకరించడంతో మార్గం సుగుమమైంది. అప్పట్లో వెంచర్‌గా ఏర్పాటు చేసిన సమయంలో నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్)గా గుర్తించకపోవడంతో ధరణిలో వ్యవసాయ భూమిగానే ఉండిపోయింది. దీనిని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు వెంచర్ నిర్వాహకులను నయాన.. భయాన నచ్చజెప్పి అంతా తాము చూసుకుంటామని చెప్పి ప్లాట్లుగా ఉన్న భూములను తిరిగి తమ పేర్లపైన రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తమకు ఎంతోకొంత ముట్టజెప్పుతారని భావించిన వెంచర్ నిర్వాహకులు భూమాయకు తమవంతు సహకారం అందించారు.

బాధితుల ఆందోళన

అక్రమార్కులు జేసీబీలు పెట్టి చదును చేసిన విషయం తెలుసుకున్న కొందరు ప్లాట్ల యజమానులు ఆదివారం అక్కడికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. తాము పైసా పైసా కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లను అమాంతంగా ఆక్రమించడం ఏమిటని లబోదిబోమన్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు ఆక్రమణకు పాల్పడ్డారని బాధితులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఫోన్ చేసి విషయాన్ని వివరించడంతో ఆయన భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

న్యాయం చేయాలి..



ఎంతో కష్టపడి తాము కొనుగోలు చేసిన ప్లాట్లను అధికార పార్టీ నాయకులు కొందరు ఆక్రమించారు. ఏకంగా ప్లాట్లను చదును చేసి వ్యవసాయ భూమిగా మార్చారు. ఇంత అన్యాయం ఎక్కడైనా ఉంటుందా.. మా ప్లాట్లు మాకు దక్కేలా న్యాయం చేయాలి. తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి.

– జనార్దన్‌రెడ్డి, ప్లాటు యజమాని, జడ్చర్ల

చర్యలు తీసుకోవాలి..



మా ప్లాట్లను ఆక్రమించి చదును చేసిన ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లేకపోతే ప్లాట్ల కొనుగోలుదారులందరం కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడుతాం. తప్పుడు కాగితాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం దారుణం.

– వజీర్, ప్లాటు యజమాని, జడ్చర్ల

మాకు సంబంధం లేదు



వెంకటాద్రినగర్ సీ బ్లాక్ ప్లాట్ల ఆక్రమణతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నాపై కొందరు గిట్టనివారు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. బాధితులకు అండగా ఉండి వారి ప్లాట్లు వారికి దక్కేలా నేనే ముందుండి పోరాడుతాను.

– దోరేపల్లి రవీందర్, బీఆర్ఎస్ నాయకుడు, జడ్చర్ల

నిబంధనల మేరకే..



ధరణిలో ఆయా సర్వే నంబర్లు వ్యవసాయ భూములుగా ఉన్నాయి. దీంతో మేము నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేశాం. ఆయా సర్వే నంబర్లలో ప్లాట్లు ఉన్న విషయం మాకు తెలియదు. గూగుల్ మ్యాప్‌లో కూడా ప్లాట్లు ఉన్నట్లు లేకపోవడంతో వ్యవసాయ భూమిగా గుర్తించి రిజిస్ట్రేషన్ చేశాం.

– లక్ష్మీనారాయణ, తహసీల్దార్, జడ్చర్ల

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న గ్రామస్తులు

- ఆపరేటర్ కోసం కరెంట్ బుడ్డీ తరలిస్తుండగా ప్రమాదం
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణం బాధితుల ధర్నా

కోస్గి: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ పిలవడంతో సింగిల్ ఫేజ్ విద్యుత్ బుడ్డి తరలిస్తుండగా షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. గుండుమాల్‌లో ఆదివారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆశన్నగౌడ్(48) కోస్గి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో రోజువారి కూలీగా పనిచేస్తున్నాడు. ఎవరైనా కాంట్రాక్టర్లు, విద్యుత్ అధికారులు, సిబ్బంది పిలిస్తే మరమ్మతు పనులకు వెళ్తాడు. ఈ క్రమంలో గుండుమాల్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ రాములునాయక్ సొంత పనుల కోసం సింగిల్ ఫేజ్ కరెంట్ బుడ్డీని తీసుకెళ్లడానికి విద్యుత్ సరఫరా ఉన్న బుడ్డీని తీసేందుకు ఆశన్నగౌడ్‌ను పిలిచాడు. అనధికారిక వ్యవహారం కావడంతోపాటు ఒకలైన్‌కు బదులు మరో లైన్ విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. అసలు విషయం తెలియక విద్యుత్ సరఫరా ఉండగానే కరెంట్ బుడ్డీని తీస్తుండగా ఒక్కసారిగా షాక్ తగలడంతో ఆశన్నగౌడ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన జరిగిన వెంటనే ఆపరేటర్ రాములునాయక్ అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఆశన్న మృతి చెందాడని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు రోడ్డెక్కి ధర్నా చేపట్టారు. నారాయణపేట– కోస్గి రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏఈ పర్వతాలు అక్కడికి వచ్చి ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ఘటనపై ఆశన్నగౌడ్ భార్య అరుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆశన్నగౌడ్‌కు భార్యతోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



ఆశన్నగౌడ్ (ఫైల్)

సమాచారం ఇవ్వలేదు..

సంబంధిత లైనమెన్‌కు గాని, ఏఈగా తనకు గాని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆపరేటర్ చేసిన తప్పుడు పనివల్లే ఆశన్నగౌడ్ మృతిచెందాడని ఏఈ పర్వతాలు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు.

యువకులకు గాయాలు..

గోపాల్‌పేట(రేవల్లి): విద్యుదాఘాతానికి గురై ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏదుల, గాంధీనగర్ గ్రామాల మధ్యలో బీటీ రోడ్డుపై ఉన్న కరెంటు వైర్లను ఎత్తు పెంచే పనులు చేస్తున్నారు. గోపాల్‌పేటకి చెందిన శ్రీను, కళమ్మల కుమారుడు వంశీ, విష్ణు, కిష్టల కుమారుడు మహేష్ ఆదివారం మధ్యాహ్నం ఏదుల, గాంధీనగర్ గ్రామాల మధ్య ఎల్‌సీ తీసుకుని పనులు చేస్తున్నారు. పనులు చేస్తుండగా.. అంతలోనే కరెంటు రావడంతో కరెంటు పోల్ మీద నుంచి ఇద్దరూ కింద పడిపోయారు. దీంతో చుట్టు పక్కల వారు గమనించి వారిని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. మహేష్‌కు గాయాలు ఎక్కువ కావడంతో మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం.

చెన్నంపల్లిలో యువరైతు..

లింగాల: విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని చెన్నంపల్లిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా.. చెన్నంపల్లికి చెందిన బొగ్గు మల్లేష్(23) సొంత వ్యవసాయ పొలంలో వేరుశనగ పంట సాగు చేశాడు. పంటకు నీటిని పెట్టే క్రమంలో బోర్ మోటారు ఆన్ చేసేందుకు స్టాటర్ వద్దకు వెళ్లగా, ప్రమాదవశాత్తు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మల్లేష్ తల్లి ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మల్లేష్ (ఫైల్)

ప్రైమ్ మినిస్టర్ టోర్నీ విజేత ఢిల్లీ

- రన్నర్స్‌గా రాయచూర్ జట్టు



విజేతగా నిలిచిన ఢిల్లీ జట్టుకు బహుమతి అందజేస్తున్న డీకే అరుణ

గద్వాల: అంతర్జాతీయ ఇన్విటేషన్ టీ–20 క్రికెట్ ప్రైమ్ మినిస్టర్ కప్ టోర్నీ విజేతగా ఢిల్లీ జట్టు నిలిచింది. 8రోజులుగా స్థానిక సోమనాద్రి స్టేడియంలో హోరాహోరిగా సాగిన పోటీలు క్రీడాభిమానులను ఎంతగానో అలరించాయి. నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) సహకారంతో జోగుళాంబ గద్వాల జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ అట్టహాసంగా ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో కర్ణాటక రాయచూర్‌కు చెందిన వీరహనుమాన్ వర్సెస్ ఢిల్లీ జట్టు తలపడ్డాయి. బ్యాటింగ్‌కు దిగిన వీరహనుమాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 175 పరుగులు చేసింది. సెమిఫైనల్‌లో మంచి ప్రతిభ కనభర్చిన సోహైల్ తక్కువ స్కోర్‌కే అవుట్ అయ్యాడు. విగ్నేష్ అగర్వాల్, రఘు మంచి స్కోర్‌ను కొంత వరుకు పరుగులెత్తించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు మొదటి నుంచి దూకుడును ప్రదర్శించింది. కేవలం 16 ఓవర్లలోనే మూడు వికెట్లను కోల్పోయి 176 పరుగులు చేసి టోర్నీ విజేతగా నిలిచింది. ఢిల్లీ జట్టులో అంకిత్ చౌదరి అద్భుతమైన ఆట తీరును కనబర్చి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 32 బంతుల్లో 3ఫోర్లు, 8సిక్స్‌లు బాది 67 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఆల్‌రౌండర్ ప్రతిభ కనబర్చిన ఢిల్లీ జట్టు క్రీడాకారుడు భరత్ శర్మకు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. వీరహనుమాన్ జట్టులోని విగ్నేష్ అగర్వాల్‌కు బెస్టు బ్యాట్స్‌మెన్‌గా, బెస్టు వికెట్ కీపర్‌గా రఘు ప్రత్యేక బహుమతులను గెలుపొందారు. విజేత ఢిల్లీ జట్టుకు రూ.2లక్షల నగదు, రన్నర్‌గా నిలిచిన వీరహనుమాన్ జట్టుకు రూ.లక్ష నగదును బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అందించారు.

క్రీడాకారులను ప్రోత్సహించడం కోసమే: డీకే అరుణ

క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసం తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఏర్పాటైందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సోమనాద్రి స్టేడియంలో ఆదివారం టోర్నీ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నడిగడ్డ యువతలో అపారమైన క్రీడాస్ఫూర్తి దాగి ఉందని, ఆ స్ఫూర్తిని అన్ని క్రీడా రంగాల్లో కొనసాగించాలన్నారు. నదిఅగ్రహారం రహదారిలో దివంగత డీకే సత్యారెడ్డి పేరు మీద క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో టీసీఏ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, త్యాగరాజు, పాండు, తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంలో అపశృతి

ఇదిలా ఉండగా మ్యాచ్ మొదటి సెషన్ పూర్తయిన సమయంలో క్రీడాకారులు కూర్చొని ఉన్న షామియానాపై టపాసులు పడి పూర్తిగా కాలిపోయింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం కాలేదు. దీంతో క్రికెట్ నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

మహారాష్ట్ర పత్తి వ్యాపారుల మోసం



మహారాష్ట్ర వ్యాపారులను నిర్బంధించిన రైతులు


అడ్డాకుల: ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని మహారాష్ట్ర వ్యాపారులు కొనుగోళ్ల వద్ద చేతివాటం ప్రదర్శించారు. నాలుగు రోజులుగా కొనుగోళ్లు చేస్తే ఐదో రోజు వారి మోసాన్ని రైతులు గుర్తించి వ్యాపారులను నిర్బంధించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటన అడ్డాకుల మండలం కన్మనూర్‌లో చోటుచేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన పత్తి వ్యాపారి సూరజ్ మరికొందరితో కలిపి నాలుగు రోజులుగా కన్మనూర్‌లో రైతుల వద్ద పత్తి కొనుగోలు చేపట్టారు. క్వింటాల్‌కు రూ.9వేల చొప్పున చెల్లిస్తూ శనివారం వరకు నాలుగు లారీల్లో పత్తిని కొనుగోలు చేసి గుజరాత్‌కు పంపించారు. ఆదివారం ఓ రైతు వద్ద పత్తిని కొనుగోలు చేస్తుండగా, వ్యాపారులు క్వింటాల్‌కు అదనంగా మరో 40కిలోల పత్తిని సంచుల్లో నింపుకుంటున్నారు. పత్తిని తూకం వేసే కాంటా వద్ద మోసం చేస్తూ ఎక్కువ పత్తిని తీసుకుంటున్నారు. పత్తి రైతుల్లో కొందరు తూకాల్లో జరుగుతున్న మోసాన్ని గుర్తించి కొనుగోళ్లను నిలిపేశారు. వ్యాపారులతో వాగ్వాదానికి దిగారు. క్వింటాల్‌కు అదనంగా 40 కిలోల పత్తిని తీసుకుంటున్నారని మండిపడ్డారు. క్వింటాల్ పత్తిని విక్రయిస్తే రూ.3వేల వరకు నష్టం వస్తోందని వాపోయారు.

జీపీలో నిరసన..

అవకతవకలకు పాల్పడిన వ్యాపారులను రైతులు తీసుకెళ్లి గ్రామ పంచాయతీలో నిర్బంధించారు. తమ వద్ద తీసుకున్న పత్తిని పక్కాగా తూకం వేసి తమకు రావాల్సిన డబ్బులను చెల్లించాలని పట్టుబట్టారు. తాము నాలుగైదు కిలోల పత్తిని మాత్రమే ఎక్కువ కాంటా వేసుకున్నట్లు వ్యాపారులు దబాయించే ప్రయత్నం చేశారు. సుమారు 3గంటల పాటు వ్యాపారులతో రైతులు చర్చించారు. గ్రామ పంచాయతీలో ఉన్న వ్యాపారులను పాఠశాలకు తీసుకొచ్చి మాట్లాడారు. చాలాసేపటి తర్వాత వ్యాపారులు చేసిన తప్పును ఒప్పుకున్నారు. లారీలో ఉన్న పత్తిని తూకం వేసి ఎక్కువ వచ్చిన పత్తికి ధర చెల్లించడానికి ముందుకు రావడంతో రైతులు సంచుల్లో ఉన్న పత్తిని కాంటా వద్దకు తీసుకెళ్లారు. సుమారు 30 మంది రైతుల నుంచి అదనంగా తీసుకున్న పత్తికి దాదాపు రూ.10లక్షలకు పైనే చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది. వ్యాపారులు కూడా పత్తి రైతులకు డబ్బులు చెల్లించేందుకు ఒప్పుకోవడంతో రైతులు ఆందోళన విరమించారు.

చెదలతో జాగ్రత్త

- చెల్కా, ఎర్రమట్టి నేలల్లో పురుగుల బెడద



అలంపూర్: చెదలు కొయ్య సామగ్రితో పాటు పంటలను ఆశించి నష్టపరుస్తాయి. గూళ్లు పెట్టి పంటలను నాశనం చేస్తాయి. వీటి నివారణలో ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా.. పంట నష్టం తప్పదని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. వీటి నివారణ మార్గాలను వివరిస్తున్నారు.

తొలకరి వర్షాలు కురిసే సమయంలో..

చెల్కా, ఎర్రమట్టి నేలల్లో చెద పురుగుల బెడద అధికంగా ఉంటుంది. ఈ పురుగులు సామూహికంగా పుట్టల్లో నివసిస్తాయి. రాణి, రాజు, సైనిక, సేవకులు అనే నాలుగు రకాలు ఉంటాయి. రాణి, రాజు పురుగులు మొదట రెక్కలు కలిగి ఉంటాయి. ఈ రెక్కల పురుగులు తొలకరి వర్షాలు కురిసే వెంటనే పుట్టలోంచి బయటికి వచ్చి నేల, గాలిలో సంపర్కం జరుపుకొంటాయి. ఆ తర్వాత రెక్కలు రాలిపోతాయి. రెక్కలు రాలిన రాణి పురుగులు భూమిలోకి పోతాయి. ఆ తర్వాత రాణి పురుగు పరిమాణం పెద్దగా మారి గుడ్లు పెట్టడం ప్రారంభిస్తుంది. బాగా అభివృద్ధి చెందిన రాణి పురుగు ఒక రోజులో సుమారుగా 30,000 నుంచి 80,000 గుడ్లు పెడుతుంది. అవసరాలను బట్టి 7 నుంచి 10 సంవత్సరాల వరకు గుడ్లు పెడుతుంది. గుడ్ల నుంచి పిల్ల పురుగులు 40 నుంచి 50 రోజుల్లో బయటికి వస్తాయి. పిల్ల పురుగులు పెద్ద పురుగులుగా మారడానికి సంవత్సర కాలం పడుతుంది. పనిచేసే పురుగులు తెల్లగా లేక గోదుమ వర్ణాన్ని కలిగి చాలా ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. సైనిక పురుగులు పని చేసే పురుగుల కంటే పెద్దగా ఉండి రెక్కలు లేకుండా ఉంటాయి.

ఇలా నష్టపరుస్తాయి..

పని చేసే చెద పురుగులు ఎక్కువ సంఖ్యలో పంట పొలాలను ఆశించి మొక్కల కాండంలోకి పోయి లోపలి పదార్థాన్ని తింటాయి. అలా తినడంతో ఏర్పడిన ఖాళీ ప్రదేశాలను మట్టితో నింపుతాయి. దీంతో మొక్కలు మొదట వడలిపోయి తర్వాత ఎండిపోయి చనిపోతాయి. మొక్కలను పీకితే సునాయసంగా ఊడొస్తాయి. పండ్లు, అడవిజాతి మొక్కల బెరడును తింటూ మట్టితో కప్పేస్తాయి. వీటి వృద్ధి మెట్ట పంటల్లో నీటి ఎద్దడి ఉన్న పండ్ల తోటల్లో ఎక్కువగా ఉంటుంది.

నివారణ ఇలా...

పంట పొలాల్లో గట్లపైన లేక పొలం చుట్టూ ఉన్న చెదల పుట్టలను తవ్వి రాణి పురుగులను గుర్తించి నాశనం చేయాలి. 5 మిల్లీలీటర్ల క్లోరిపైరిఫాస్ 50 ఈసీ మందును లీటరు నీటిలో కలిపి సుమారు 15 నుంచి 30 లీటర్ల మందు ద్రావణాన్ని చెద పుట్టలు బాగా తడిసేలా పోయాలి. చెరుకు విత్తనాన్ని మలాథీయాన్(లీటరు నీటికి 2.0 మి.లీ మోతాదులో కలిపిన) ద్రావణంలో 15 నిమిషాలు ఉంచి నాటడం ఉత్తమం. నారుమడులను తయారు చేసేటప్పుడు లిండేను, మిథైల్ పెరాథియాన్, మరేదైన పొడి మందులను నారుమడుల్లో కలపాలి. చెట్లు నాటే గుంతల్లో కూడా ఏదైన పొడి మందును గుంతలకు 100 గ్రాముల మోతాదులో కలపాలి. పాలిథిన్ సంచుల్లో మొక్కలను పెంచినప్పుడు ఆ సంచుల్లో పోసే మట్టి మిశ్రమానికి కూడా పైన చెప్పబడిన మందులను 15 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి. ఆ తర్వాత క్లోరిపైరిఫాస్ మందును 5 మిల్లీలీటర్లను ఒక లీటరు నీటితో కలిపి చెట్టు చూట్టూ మట్టిని కదలించి పోస్తే మంచి ఫలితం ఉంటుంది.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన డీసీఎం

మాగనూర్: మక్తల్ మండలంలోని లక్కీదాబా సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు గొర్రెల మందపైకి డీసీఎం వాహనం దూసుకెళ్లడంతో 28 గొర్రెలు, ఒక గాడిద అక్కడికక్కడే మృతిచెందాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మరికల్ మండలం పర్దీపూర్‌కు చెందిన గొర్ల కాపరులు గ్రామం నుంచి కర్ణాటకలోని గొబ్బూర్‌కు 200 గొర్రెల మందతో మేత కోసం తరలిస్తున్నారు. హైదరాబాద్ నుంచి రాయచూర్ వైపు వెళ్తున్న లారీ మక్తల్ మండలం లక్కీదాబా సమీపంలో ప్రమాదవశత్తు గొర్రెల మందను వెనుక నుంచి ఢీకొట్టడంతో 28 గొర్రెలు, ఒక గాడిద మృతిచెందగా, మరి కొన్నింటికి గాయాలయ్యాయి. స్థానికులు డీసీఎం డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.



ప్రమాదంలో మృతిచెందిన గొర్రెలు

ఆ రూ. 495 కోట్లు ఇప్పించండి

- ఏపీకి బదలాయించిన సీఎస్ఎస్ నిధులపై మంత్రి హరీశ్‌రావు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు బదలాయించిన కేంద్ర ప్రాయోజిత పథకాలకు (సీఎస్ఎస్) సంబంధించిన రూ.495 కోట్లు తిరిగి ఇప్పించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 2014–15లో సీఎస్ఎస్ కింద తెలంగాణకు హక్కుగా రావాల్సిన నగదును పొరపాటున ఆంధ్రప్రదేశ్‌లో ఖాతాలో జమచేశారని, దాన్ని తిరిగి తెలంగాణకు ఇప్పించాలని కోరారు. ఈ మేరకు హరీశ్‌రావు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తి చేసినా, కేంద్రానికి లేఖలు రాసినా ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత మొదటి సంవత్సరంలో (2014–15) కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య జనాభా ప్రాతిపదికన విభజించారని, అయితే పొరపాటుగా మొత్తం సీఎస్ఎస్ నిధులను ఆంధ్రప్రదేశ్‌కు జమ చేశారని గుర్తుచేశారు. దీంతో తెలంగాణ నష్టపోయిందన్నారు. ఈ విషయాన్ని తాము ఇప్పటికే ఏపీ, కేంద్ర ప్రభుత్వాలతోపాటు అకౌంటెంట్ జనరల్ దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు. ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఆ రూ.495 కోట్లను తెలంగాణకు ఇంకా సర్దుబాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా ఆ మొత్తాన్ని తిరిగి ఇప్పించేలా కృషి చేయాలని, వ్యక్తిగతంగా చొరవ తీసుకొని తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని సీతారామన్‌ను కోరారు.

మంగ్లీ కారుపై రాళ్లు

బళ్లారి ఉత్సవాల్లో ఘటన



సాక్షి, బళ్లారి: బళ్లారి ఉత్సవ్‌లో పాటలు పాడేందుకు వచ్చిన ప్రముఖ గాయని మంగ్లీ కారుపై కొందరు రాళ్లు విసరడంతో అద్దాలు పగిలిపోయాయి. నగరంలో నిర్వహించిన ఉత్సవంలో శనివారం రాత్రి 12 గంటల వరకు మంగ్లీ తెలుగు, కన్నడ భాషలకు చెందిన వివిధ రకాలు పాటలు పాడి అలరించారు. కార్యక్రమం ముగిశాక బయటకు వచ్చేటప్పుడు ఆమెను కలుసుకునేందుకు పెద్ద సంఖ్యలో యువత పోటీ పడ్డారు. దీంతో పోలీసుల స్వల్ప లాఠీచార్జి కూడా చేయాల్సి వచ్చింది. అంతలోనే ఆమె మేకప్ గదిలోకి వెళ్లడంతో కొందరు ఆమె కారుపై రాళ్లు రువ్వడంతో కారు గ్లాసు పగిలిపోయింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

అడవిపై ఈ-కన్ను

- ➡ పగటి వేళ చెరువులో కొంతసేపు జలకాలాటలు ఆడిన ఓ పెద్దపులి, ఆ తర్వాత ఒడ్డునే ఉన్న ఓ చెట్టుకు శరీరం, తల రుద్దుకుంటూ సేదతీరింది.
- ➡ ఒకచోట రెండు, మూడు పులులు తమ పిల్లలతో కలిసి ఆడుకుంటూ ఫుల్లుగా ఎంజాయ్ చేశాయి.
- ➡ కొన్ని జంతువులు ఇతర జంతువులపై దాడికి దిగి, ఆకలి తీరాక పక్క నుంచి బలహీనమైన ఇతర వన్యప్రాణులు వెళుతున్నా పట్టించుకోలేదు.
- ➡ ఓ నీటిగుంటలో ఒక సాంబార్ జింక నిద్రిస్తుండగా అడవి కుక్కలు దాన్ని చుట్టుముట్టే ప్రయత్నం చేశాయి. క్షణాల్లోనే అప్రమత్తమైన ఆ జింక వేగంగా తప్పించుకోవడంతో అడవి కుక్కలు నిరాశగా వెళ్లిపోయాయి.
- ➡ ఎఫ్–6 (పులి) రాత్రి వేళ స్వేచ్ఛగా సంచరించడం స్పష్టంగా కన్పించింది.
- ➡ ఇలాంటి అనేక వీడియోలు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో కెమెరాల్లో రికార్డయ్యాయి.

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ఎలక్ట్రానిక్-ఐ నిఘా వ్యవస్థ

- పులులు, ఇతర వన్యప్రాణుల ప్రతి కదలిక పక్కాగా, స్పష్టంగా రికార్డ్
- కీలక ప్రదేశాల్లో 10 అత్యాధునిక కెమెరాలతో పర్యవేక్షణ
- ఇంటర్నెట్ నెట్‌వర్క్ లేనిచోట్ల రేడియో ఫ్రీక్వెన్సీతో 24 గంటల సర్వైలెన్స్
- ఎక్కడి నుంచైనా లైవ్‌లో వీక్షించే అవకాశం
- మరిన్ని ఏర్పాటు చేస్తే పూర్తిస్థాయిలో వన్యప్రాణులు, అటవీ సంరక్షణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2,611 చ.కి.మీ పరిధిలో విస్తరించి పెద్దపులుల అభయారణ్యంగా పేరుగాంచిన ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్)లో పటిష్టపరిచిన ఎల్క్ట్రానిక్-ఐ (ఈ-కన్ను) నిఘా వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. పెద్దపులులు, ఇతర వన్యప్రాణుల కదలికలు తెలుసుకునేందుకు, వాటి సంరక్షణకు.. అటవీ ఆక్రమణలు, జంతువుల వేట, కలప స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు బాగా ఉపయోగపడుతోంది. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కొంతకాలం క్రితమే ప్రయోగాత్మకంగా ఏటీఆర్‌లో అధికారులు ప్రారంభించారు. ప్రస్తుతానికి పది కెమెరాలను వినియోగంలోకి తీసుకురాగా.. పులులు, ఇతర జంతువులకు సంబంధించి వచ్చిన లైవ్ వీడియోలు, ఫొటోలు అబ్బురపరిచే విధంగా ఉన్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

ఎక్కడినుంచైనా పర్యవేక్షణ

క్షేత్రస్థాయిలో పెద్దసంఖ్యలో అటవీ సిబ్బందిని నియమించాల్సిన అవసరం లేకుండా, కీలకమైన, క్లిష్టమైన ప్రదేశాల్లో వారానికి ఏడు రోజులు 24 గంటల పాటు (24/7) కచ్చితత్వంతో అటవీ ప్రాంతాన్ని పర్యవేక్షించేందుకు దీని ద్వారా వీలు కలిగింది. సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ ద్వారా పనిచేసే ఈ విధానంలో... వివిధ సెన్సిటివ్ జోన్లలో హై రెజల్యూషన్ థర్మల్, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాల ద్వారా మనుషులు, పులుల కదలికలను రికార్డ్ చేశారు. ఉన్నతాధికారుల సెల్‌ఫోన్‌కు జంతువుల కదలికలు, ఇతర ఘటనలకు సంబంధించిన అలర్ట్‌లు, నోటిఫికేషన్లు వచ్చే సాంకేతికతను ఏర్పాటు చేశారు.

రేడియో ఫ్రీక్వెన్సీతో ఇంటర్నెట్ అనుసంధానం

అడవిలో ఇంటర్నెట్ నెట్‌వర్క్ కవర్ కాని చోట్ల రేడియో ఫ్రీక్వెన్సీతో 360 డిగ్రీల పరిధిలో 24 గంటల సర్వైలెన్స్ ద్వారా పులులు, వన్యప్రాణుల కదలికల్ని గమనిస్తూ పర్యవేక్షించగలుగుతున్నారు. రేడియో ఫ్రీక్వెన్సీ నెట్‌వర్క్ నుంచి ఇంటర్నెట్‌కు దృశ్యాలు కన్వర్టయ్యే స్ట్రీమింగ్‌తో ఎక్కడి నుంచైనా లైవ్‌లో మానిటర్ చేసే అవకాశాలుండడం అధికారులకు ఉపకరిస్తోంది. అడవుల్లో మొబైల్ టవర్లు నెలకొల్పలేని మారుమూల అటవీ ప్రాంతాల్లో, సిగ్నల్స్ లేనిచోట రేడియో వేవ్ కమ్యూనికేషన్ ద్వారా...ఇంటర్నెట్ ఓవర్ రేడియో (ఐవోఆర్‌ఏ) విధానం ద్వారా వాకీటాకీలు పనిచేసేలా వ్యవస్థను రూపొందించారు.

ఐటీ శాఖతో చర్చలు

ఫారెస్ట్ కోడ్ ప్రకారం బీట్ ఆఫీసర్లు నెలలో 26 రోజుల పాటు రాత్రి వేళ అడవిలో తిరగాలి. టేకు చెట్లను కొట్టినా, అడవి నరికినా వాటిని వారు గుర్తించిపై అధికారులను అలర్ట్ చేయాలి. ప్రస్తుతం ఈ–ఐ ఏర్పాటుతో వీరి పని సులభంగా మారింది. ప్రస్తుతం ఏటీఆర్‌లో ఈ వ్యవస్థను మరింత విస్తృతం చేసే ఆలోచనతో అధికారులున్నారు. పైలెట్ ప్రాజెక్ట్ స్థాయిలో చేసేందుకు తెలంగాణ ఐటీశాఖతో ఏటీఆర్ అధికారులు చర్చలు జరిపినట్టు సమాచారం. ప్రస్తుతం పది కెమెరాలతోఏర్పాటు చేసిన విధానం వల్ల పరిమితంగానే అడవి కవర్ అవుతోంది. దీనిని మరింత విస్తృత పరచడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వంద నుంచి రెండువందల దాకా కెమెరాలు ఏర్పాటు చేస్తే బావుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో వాచ్ టవర్‌కు అడ్వాన్స్‌డ్ కెమెరా కోసం రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ కోసం రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఏటీఆర్‌కు దాదాపు వంద ఎంట్రీ పాయింట్లు ఉన్నందున, రెండువందల కీలక ప్రదేశాల్లో కెమెరాలు ఏర్పాటు చేస్తే దేశంలోనే పటిష్టమైన నిఘా వ్యవస్థ కలిగిన టైగర్ రిజర్వ్‌గా దీనిని తీర్చిదిద్దవచ్చునని చెబుతున్నారు.

అడవిలో కదలికలన్నీ తెలిసిపోతున్నాయ్..



వన్యప్రాణుల సంరక్షణకు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. ఈ–ఐ కెమెరాలతో అడవిలో ఏం జరుగుతోందో తెలిసిపోతోంది. జంతువుల కదలికలను స్పష్టంగా చూడగలుగుతున్నాం. లోతైన లోయలు, కొన్ని ఇతర ప్రాంతాల్లో పర్యవేక్షణ చాలా కష్టంగా ఉంటుంది. వాకీటాకీలు పనిచేయని పరిస్థితులుంటాయి. ఇంటర్నెట్ ఓవర్ రేడియో విధానం ద్వారా మొబైల్ సిగ్నల్స్ లేకపోయినా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు అవకాశం ఉంటుంది.

– రోహిత్ గొప్పిడి, డీఎఫ్‌వో, నాగర్‌కర్నూల్ జిల్లా

ముగ్గురు బిడ్డలను రోడ్డుపై వదిలేసి..

- ప్రియుడితో వెళ్లిపోయిన మహిళ
- కన్న బిడ్డలపై తల్లి కర్కశత్వం
- యాదగిరిగుట్టలో ఆలస్యంగా వెలుగులోకి
- అధికారుల సంరక్షణలో చిన్నారులు



అధికారులు, పోలీసుల వద్ద చిన్నారులు

యాదగిరిగుట్ట: అమ్మతనానికి ఓ తల్లి మాయని మచ్చ తెచ్చింది. పేగు తెంచుకుని పుట్టిన ముగ్గురు చిన్నారులను నడిరోడ్డుపై వదిలేసి ప్రియుడితో కలసి వెళ్లిపోయింది. ఎముకలు కొరికే చలిలో ఆ చిన్నారులు తల్లి కోసం రోదిస్తూ పడిన వేదన వర్ణనాతీతం. చివరకు పోలీసులు పిల్లలను చేరదీసి బాలల పరిరక్షణ అధికారులకు అప్పగించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన లక్ష్మి పన్నెండేళ్ల క్రితం బాబుని ప్రేమించి వివాహం చేసుకుంది. కానీ తరచూ గొడవల కారణంగా లక్ష్మి భర్త బాబు.. మూడేళ్ల క్రితం కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయాడు. అప్పటికే వీరికి లక్ష్మణ్ (8), రాజేశ్వరి (7), రేవంత్ (5) అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త వెళ్లిపోవడంతో లక్ష్మి.. పిల్లలను చూసుకుంటూ చిన్న చిన్న పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ క్రమంలో అక్కడే నివాసం ఉండే ఓ ఆటో డ్రైవర్‌తో లక్ష్మికి పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారడంతో అతడితో సహజీవనం చేస్తోంది.

పిల్లలు అడ్డుగా ఉన్నారని..

ఆటో డ్రైవర్ రాజుతో సహజీవనం చేస్తున్న తరుణంలో లక్ష్మి తన ముగ్గురు పిల్లల అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగానే ఈ నెల 14వ తేదీన ఆటో డ్రైవర్ రాజుతో కలసి యాదగిరిగుట్టకు వచ్చింది. ఆ రోజు రాత్రి తమతో వచ్చిన ముగ్గురు పిల్లలను యాదగిరిగుట్ట పట్టణ పరిసరాల్లో వదిలేసి.. లక్ష్మి, ఆటో డ్రైవర్ రాజుతో కలసి వెళ్లిపోయింది. దీంతో ఎముకలు కొరికే చలిలో ఆ రోజు రాత్రంతా ముగ్గురు పిల్లలు పట్టణంలోనే ఏడుస్తూ ఉండి పోయారు. మరుసటి రోజు ఉదయం యాదాద్రి కొండపైకి వెళ్లే మార్గంలోని పార్కింగ్ వద్ద చిన్నారులు ఏడుస్తూ తిరుగుతుండగా.. ట్రాఫిక్ కానిస్టేబుల్ కోటి వీరిని గమనించి పట్టణ పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌ఐ సుధాకర్‌రావు దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ ఎస్‌ఐ పిల్లలకు టిఫిన్ చేయించి, వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సంబంధం లేదన్న పెదనాన్న

ఈ నేపథ్యంలో అధికారులు చిన్నారులను ఈ నెల 17వ తేదీన భువనగిరిలో విచారించారు. తల్లి తమను యాదగిరిగుట్టలో వదిలేసి మరో వ్యక్తిని వివాహం చేసుకొని వెళ్లిపోయిందని పిల్లలు తెలిపారు. దీంతో చిన్నారుల పెదనాన్న జంగయ్యకు ఫోన్ చేసి భువనగిరికి పిలిపించగా జంగయ్య.. ఆ పిల్లలతో తమకు సంబంధం లేదని చెప్పి వెళ్లిపోయినట్టు తెలిసింది. ప్రస్తుతం ఐదేళ్ల రేవంత్ రంగారెడ్డి శిశు గృహంలో, మరో ఇద్దరు పిల్లలు రాజేంద్రనగర్‌లోని చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సైదులు, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జయశ్రీ వెల్లడించారు.

ఇక శనివారాల్లోనూ వీసా అపాయింట్‌మెంట్లు

సాక్షి, హైదరాబాద్: తొలిసారిగా వీసా కోసం దరఖాస్తు చేసుకున్నవారి నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు ఢిల్లీలోని యూఎస్ ఎంబసీతోపాటు ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్లు శనివారం ప్రత్యేక ఇంటర్వ్యూలకు చర్యలు చేపట్టాయి. వ్యక్తిగత ఇంటర్వ్యూల నిర్వహణ కోసం ఈ నెల 21న తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. రాబోయే నెలల్లో సైతం ఎంపిక చేసిన శనివారాల్లో వీసా అపాయింట్‌మెంట్ల కోసం అదనపు స్లాట్‌లను జారీ చేయనున్నట్టు న్యూఢిల్లీలోని యూఎస్ ఎంబసీ ఒక ప్రకటనలో తెలిపింది. వీసాల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచేందుకు 2023 జనవరి–మార్చి మధ్యకాలంలో వాషింగ్టన్, ఇతర ఎంబసీల నుంచి డజన్ల మంది అధికారులు భారతదేశానికి రానున్నారు. ఇటీవల భారతదేశంలో 2.50 లక్షలకుపైగా అదనపు బీ1/బీ2 వీసా అపాయింట్‌మెంట్లను జారీ చేసింది. అదనపు అపాయింట్‌మెంట్ల జారీకి ముంబైలోని కాన్సులేట్ వారపు పనివేళలను పెంచింది. వేసవి నాటికి దేశంలోని యూఎస్ ఎంబసీ, కాన్సులేట్లు పూర్తిస్థాయి సిబ్బందితో కోవిడ్–19 మహమ్మారికి ముందునాటి స్థాయిలో వీసాల ప్రాసెసింగ్ చేపడతాయని న్యూఢిల్లీలోని యూఎస్ ఎంబసీ ఆశాభావం వ్యక్తం చేసింది.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా పుణ్యాహవాచనము జరిపించి స్వామి, అమ్మవార్లకు 108 కలశాలతో అభిషేకం చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవాలు పురస్కరించుకుని ఆలయానికి కొత్త శోభ సంతరించుకుంది. ఈ అలంకరణ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తి నీటిమట్టం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200, సమాంతర కాల్వ ద్వారా 425 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 250, తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.



తరతరాల చరిత్రకు మౌనసాక్షి

కాకతీయుల కాలంలో నిర్మితమై వారి పాలనకు దర్పణంగా నిలిచిన కోటలు, ఆలయాలు.. ప్రస్తుతం ఆలనపాలనకు నోచుకోక తరతరాల చరిత్రకు మౌనసాక్షిగా నిలిచాయి. ఈ చారిత్రక కట్టడాలు భావితరాలకు అందించాలంటే వీటిని పునరుద్ధరించి కాపాడాల్సిన బాధ్యత ఇటు పురావస్తుశాఖ.. అటు ప్రభుత్వంపై ఉందని చరిత్ర పరిశోధకులు అంటున్నారు. మండలంలోని పెద్దకడ్మూర్‌లో నిర్మించిన 500 ఏళ్ల నాటి బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం, కోట బురుజులు ఇలా దుస్థితికి చేరాయి.

- నర్వ

జోగుళాంబ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణలో ఎమ్మెల్యే అబ్రహం, ఆలయ సిబ్బంది

- ఆనతి స్వీకరణ ఆపై ఊరేగింపుగా యాగశాల ప్రవేశం
- ప్రదోశ కాలంలో జరిగిన మృత్ సంగ్రహణం, అంకురార్పణ
- ధ్వజారోహణకు హాజరైన ప్రముఖులు

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ అమ్మవారి ఆలయంలో 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఆలయంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రాథఃకాలం ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు మంగళవాయిద్యాలు, వేద పండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రధాన ఆలయమైన బాలబ్రహ్మేశ్వరస్వామి దగ్గరకు చేరుకున్నారు. అక్కడ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆనతి స్వీకరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ భేరిభేరితో ఆలయ ప్రాంగణంలో గోనహితంగా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి యాగశాల ప్రవేశం చేశారు. యాగశాలలో గణపతి పూజలు, పుణ్యహవాచనం, రుత్విక్‌వరణం, మహా కలశ స్థాపన, ఆవాహిత దేవత మండపారాధనలు చేశారు అదేవిధంగా ప్రదోశకాలంలో యాగశాలలో షట్పాత్ర ప్రయోగం అగ్నిముఖం వంటి కార్యక్రమాలు చేపట్టారు.

కార్యక్రమాలకు బీజం వేస్తూ అంకురార్పణ..

జరగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బ్రహ్మేశ్వర ఉద్యానవనంలో పుట్టమట్టిని తెచ్చి పాలికలలో వేసి నవధాన్యాలు, పుణ్యనది జలాలతో చల్లి అంకురార్పణ చేశారు. కుంకుమార్చన మండపంలో సర్వతోభద్రమండపం ఏర్పాటు చేసి అక్కడ సహస్రఘటాలను స్థాపన చేశారు. వీటికి అయిదు రోజుల పాటు త్రికాల సమయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. అదే విధంగా ఆలయంలో బలిహరణలు నిర్వహించారు.

ధ్వజారోహణ..

ఉత్సవాల ప్రారంభం రోజు జోగుళాంబ ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డా.వీఎం అబ్రహం హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ, చైర్మన్, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల దర్శన అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా ధ్వజారోహణ చేయించారు. ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ మంత్రోచ్ఛరణల మధ్య వేద పండితులు క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఈఓ పురేందర్, ఆలయ కమిటీ సభ్యులు జయన్న, విష్ణువర్ధన్ రెడ్డి, అనంతేశ్వర్ రెడ్డి, ఉషాదేవి, రాముడు, హరిబాబు, మున్సిపల్ చైర్మన్ మనోరమ తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబదేవికి బంగారు పతకం..

కడప జిల్లాకు చెందిన దేవగుడి చంద్రమౌళీశ్వర్ రెడ్డి ప్రభావతి అనే భక్తుడు జోగుళాంబ అమ్మవారికి బంగారు పతకం చేయించి బహూకరించారు. 110 గ్రాముల బరువు గల ఈ బంగారు పతకం ధర రూ.5లక్షల90 వేల609 ఉంటుందని సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ తెలిపారు.

పాణవట్టం విరాళం..

ఆలయాల్లో జరిగే ఉత్సవాలలో భాగంగా తీర్థవళి, అవబృదస్నపన వంటి కార్యక్రమాల కోసం హైదరాబాద్‌కు చెందిన డి.శంకరప్ప శోభారాణి నాగేష్, అపర్ణ అనే భక్తులు రూ.25వేలు విలువ చేసే ఇత్తడి పాణవట్టం బహూకరించారు. వీటిని దేవస్థానం ఈఓ, చైర్మన్ పాలకమండలికి అందజేశారు.

సొమ్మసిల్లిన భక్తుడు..

కడప జిల్లాకు చెందిన కాశీరెడ్డి(72) అనే భక్తుడు తన కుటుంబంతో కలసి ఆదివారం జోగుళాంబ ఆలయానికి వచ్చారు. కాగా దర్శనం అనంతరం వారు కిందకి వస్తుండగా ధ్వజస్తంభం వద్దకు రాగానే బీపీ డౌన్ కావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపడ్డాడు. అక్కడే ఉన్న ఆలయ ఈఓ దీన్ని గమనించి సిబ్బందిని పురమాయించి భక్తుడికి వైద్యసేవలు అందించడంతో ప్రమాదం తప్పింది.

5రోజుల పాటు సహస్ర ఘటాలు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈఏడాది నుంచి ఉత్సవాలలో ఐదురోజుల పాటు సహస్ర ఘటాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా అమ్మవారి కుంకుమార్చన మండపంలో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేశారు.



ఆనతి స్వీకరణకు పట్టు వస్త్రాలతో వెళుతున్న ఆలయ ఈఓ, చైర్మన్



జోగుళాంబ దేవికి హారతి ఇస్తున్న అర్చకుడు

కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు

– ముగిసిన ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలు

అచ్చంపేట: అచ్చంపేట మండలం రంగాపూర్ నిరంజన్‌షావలీ ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఉర్సు ప్రారంభమైన నాటి నుంచి నిరంజన్‌షావలి దర్గాలో భక్తుల సందడి ఏమాత్రం తగ్గలేదు. ప్రత్యేక మొక్కులు ఉన్న భక్తులు పోటేలు సమర్పించి పాతేహాలు, కందోరీలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. కోరిన కోరికలు తీరాలని దర్గాకు వచ్చిన భక్తులు చెట్టుకు ముడుపులు కట్టారు.

పేదల కొంగుబంగారం పాలెం వెంకన్నస్వామి



పాలెం వెంకన్న ఆలయం

బిజినేపల్లి: పేదల కొంగు బంగారంగా పిలుచుకునే పాలెం శ్రీ అలమేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాల కోసం ఆలయ నూతన కమిటీ చైర్మన్ జున్న శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. జనవరి 26న స్వామివారి కల్యాణం, 28న రథోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

- 1962 సంవత్సరం నాటి నుంచి తిరుమల తిరుపతి వెళ్లలేని భక్తుల కోసం పాలెంలోనే మనుసాని నీలకంఠయ్య కుమారులు రామలింగయ్య, బాలింగయ్యలు ఈ ఆలయ నిర్మాణం, స్వామి వార్ల ప్రతిష్ఠాపన నిర్వహించారు. స్వామి విగ్రహం తిరుమల స్వామి వారిలాగానే పోలి ఉండటంతో రాష్ట్రంలోనే పాలెం శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అందుకే పాలెం శ్రీవేంకటేశ్వరస్వామి వారిని రెండో తిరుమలగా, పేదల కొంగు బంగారంగా పిలుస్తారు. ఈ ఆలయం ఉమ్మడి జిల్లా కేంద్రం నుంచి శ్రీశైల క్షేత్రం వెళ్లే ప్రధాన రహదారిలో బిజినేపల్లి మండలం పాలెంలో చిన్న తిరుమల కొలువై ఉంది. 13 ఎకరాల స్థలంలో నిర్మించిన ఆలయంలో కల్యాణ మండపం, అన్నదాన సత్రం, అర్చకుల వసతి కేంద్రాలు, ఎండోమెంట్ కార్యాలయం ఉంది.

కార్యక్రమాలు ఇలా..

23న ఉదయం స్వామి వారి అభిషేకం, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనము, నిత్యారాధన, భాగవత పద్య పఠన పోటీలు, రాత్రి అంకురార్పణ, రక్షాబంధనం, ప్రబంధ పారాయణం, హంసవాహన సేవ ఉంటుంది.

- 24న నిత్యారాధనం, హోమ బలిహరణం, ధ్వజారోహణం, గరుడ పొంగలి నివేదన, సంతానం లేని వారికి ప్రసాద వితరణ, రాత్రికి హోమం, బలిహరణ, భేరీపూజ, హనుమంత వాహన సేవ, నివేదన, తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 25న ఉదయం నిత్యపూజా కార్యక్రమం, ప్రబంధ పారాయణం, హోమబలిహరణం, నివేదన, లక్ష పుష్పార్చన, స్వామి వారి సుప్రభాత పోటీలు, రాత్రి గరుఢవాహన సేవ, స్వామి వారి ఎదుర్కోళ్ల కార్యక్రమాలుంటాయి.



అలమేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు

- 26న ఉదయం నిత్యపూజా కార్యక్రమం, ప్రబంధ పారాయణం, హోమబలిహరణం పూజల అనంతరం ఉదయం 11 గంటలకు అలమేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. రాత్రి గజవాహన సేవ, నివేదన, తీర్థ ప్రసాద వితరణ ఉంటుంది.
- 27న ఉదయం నిత్యారాధన, ప్రబంధ పారాయణం, నివేదన, జిల్లా స్థాయి భజన పోటీలు, రాత్రి సమయానికి పల్లకిసేవ, బలిహరణ కార్యక్రమాలున్నాయి.
- 28న ఉదయం నిత్యారాధన, ప్రబంధ పారాయణం, హోమ బలిహరణం, మండల స్థాయి గోవింద నామాల పోటీలు, సామూహిక వ్రతాలు, నిర్వహించగా.. రాత్రి సమయానికి హోమం, రథ హోమం, రథ కుంభము, బలి, స్వామి వారి రథోత్సవం(తేరు) భారీ భక్త జన సందోహం మధ్యన నిర్వహిస్తారు.
- 29న ఉదయం నిత్యారాధన, హోమ బలిహరణం, భక్తి గీతాల పోటీలు, రాత్రి హోమం, మలిహరణ, అశ్వవాహన సేవ, తీర్థ ప్రసాద వితరణ ఉంటుంది.
- 30న ముగింపు రోజు నిత్యారాధన, హోమం, పూర్ణాహుతి, బలిహరణం, చక్రస్నానం, నివేదన, ధ్వజారోహణం, పుష్పయాగం, శేష వాహన సేవ, దేవతా విసర్జన, మూకబలి, తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వహించనున్నారు.